నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ, కిష్టాపూర్, మేడ్చల్, రాజబొల్లారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రాంబాబు తెలిపారు. నూతన విద్యుత్‌లైన్, మరమ్మతుల కారణంగా వెల్‌సెట్, టైమ్ టెక్నో, సుమా బిస్కట్, గోసాయగూడ, కిష్టాపూర్, ఐడీఏ హనుమాన్, సీమర్, ఐడీఏ మేడ్చల్, కండ్లకోయ, చెక్‌పోస్ట్, వాటర్ గ్రిడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రాజబొల్లారం, తండా, హర్షత్ పౌల్ట్రీ, వేంకటేశ్వరస్వామి గుట్ట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

తేమలేని ధాన్యాన్ని తీసుకురావాలి



ఏదులాబాద్ కొనుగోలు కేంద్రం వద్ద అదనపు కలెక్టర్ హరిప్రియ

ఘట్‌కేసర్: ఏదులాబాద్, మాదారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ హరిప్రియ, పౌర సరఫరా శాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి, ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, డీఎస్‌సీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఓ వెంకట్‌రెడ్డితో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తేమలేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని ఆమె సూచించారు. ప్రభుత్వం సూచనల మేరకు 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ధాన్యం వర్షానికి తడవకుండా ఉండటానికి రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, ధాన్యం త్వరితగతిన తరలించడానికి అదనపు వాహనాలు, టార్పాలిన్, తూకం మిషన్లు, తేమ మీటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల ఏర్పాటు, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ధాన్యం విక్రయించిన 48 గంటలలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా బిపిన్‌కుమార్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా బిపిన్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేసిన వివేక్ హబ్సీగూడకు బదిలీ కాగా.. నాగోల్‌లో మేనేజర్‌గా పనిచేసిన బిపిన్‌కుమార్ ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవాసహకార సంఘంలో చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. వైస్ చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పోచిరెడ్డి, రమేష్, బాలరాజ్‌యాదవ్, వెంకటేష్, ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ వ్యవసాయాధికారిగా లావణ్య



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారిగా లావణ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించిన బాసిత్ జెడ్చర్లకు బదిలీ కాగా.. అక్కడ వ్యవసాయాధికారిగా పనిచేసిన లావణ్య ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు.

దళారులను నమ్మి మోసపోవద్దు !

శామీర్‌పేట్: దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే ధాన్యాన్ని తరలించాలని మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి అన్నారు. శనివారం జగ్గంగూడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ధాన్యంలో తేమ, తాలు లేకుండా చూసుకోవాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా.. నేరుగా సంప్రదించాలన్నారు.

సాగుపై రైతులకు అవగాహన

మేడ్చల్: 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మేడ్చల్ మండలంలోని ఖాజీగూడ, అత్వెల్లి, నూతనకల్, రాజబొల్లారం తదితర గ్రామాల్లో శనివారం పర్యటించారు. సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువులు అధిక మోతాదులో వినియోగిస్తే కలిగే నష్టాలు, అధిక దిగుబడి సాధించే రకాలు, జీవన ఎరువులు, పచ్చి రొట్టె ఎరువుల వాడకం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు వసంత, పుష్పవల్లి, పరమేష్, సంతోషి, వరప్రసాద్, సౌమ్య, సాయి, వెంకటేష్, స్వర్ణలత, ఏవో అర్చన, వ్యవసాయ విస్తరణాధికారులు సుమిత, తేజస్విని రైతులు పాల్గొన్నారు .

నాడి పట్టేది నకిలీలే !

అర్హత లేకుండా వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లు

- బాధితుల ఫిర్యాదులతో 38 ఆసుపత్రుల సీజ్
- ప్రైవేటు ఆసుపత్రుల్లో పర్యవేక్షణ లోపం

సాక్షి,సిటీబ్యూరో: అర్హతలు లేకుండా వైద్యం చేస్తూ.. ప్రజల ప్రాణాలు తీస్తున్న నకిలీ వైద్యులపై కేసులు నమోదైన ఘటనలు గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో చర్చనీయాంశమవుతోంది.

☛ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో దాదాపు 3,835 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా.. ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో కొనసాగుతున్న ఆసుపత్రులు 2,840 మాత్రమే ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో 100 కంటే ఎక్కువ పడకలు (బెడ్స్) ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 58 ఉండగా.. 20 నుంచి 100 పడకలు (బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 417 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ చెబుతోంది.



వీటిలో అనుమతిలేనివి అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అనుమతులు లేనివి అధికం..

20 పడకలు (బెడ్స్) ఉన్న ఆసుపత్రులు 594 ఉన్నాయి. 1012 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, 280 డెంటల్ ఆసుపత్రులు, 66 ఫిజియోథెరపీ సెంటర్లు, 10 రిహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నాయి.

అనుమతి నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లినిక్‌లు, పిజియోథెరపీ కేంద్రాలు అన్నింటికీ అనుమతి తప్పనిసరి. ఆసుపత్రి, క్లినిక్. డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులు, అందులో పని చేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి.

☛ అగ్నిమాపక, బయోవేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌తో సహా అన్ని రకాల పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇస్తారు.

సీజ్ అయిన ఆసుపత్రులు ఇవే..

బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని చెంగిచర్ల భవిష్యా వెల్ విస్సర్ ఆసుపత్రిని అర్హత లేని మెడికల్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందితో కొనసాగిస్తున్నట్లు గుర్తించిన వైద్యశాఖ ఇటీవల ఈ ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను 60 రోజులు సస్పెండ్ చేయడంతో పాటు మేనేజ్‌మెంట్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. ఆసుపత్రి ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకుని, అన్ని వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ ఉపకరణాలను జప్తు చేసింది. ఆసుపత్రి యాజమాన్యానికి రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది.

☛ జగద్గిరిగుట్టలోని హాసిని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను ఫార్మ్‌డీ అర్హత ఉన్న ప్రతీక్ అనే వ్యక్తి నకిలీ జనరల్ ఫిజిషియన్‌గా వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి, ఈ క్లినిక్‌ను సీజ్ చేసింది.

☛ బాచుపల్లిలో ఎలాంటి అర్హతలు లేకుండా కొనసాగుతున్న సహజ పాలీక్లినిక్, బుచ్చిబాబు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను సీజ్ చేసింది.

☛ మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో అనుకృష్ణ ఆసుపత్రిని సీజ్ చేసిన వైద్యబృందం డీఎం ఆసుపత్రికి నోటీసులు జారీ చేసింది.

☛ మల్కాజిగిరి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, షాదన్‌క్లినిక్‌లను వైద్యాధికారులు సీజ్ చేశారు.

☛ అల్వాల్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న గౌరవి పాలీ క్లినిక్, భువన డయాగ్నస్టిక్ సెంటర్‌ను సీజ్ అయ్యింది.

☛ బొల్లారంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించిన భవాని పాలీక్లినిక్‌ను వైద్య బృందం సీజ్ చేసింది. ఈ క్లినిక్ అనేక ఏళ్లుగా ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే వైద్యసేవలను అందిస్తున్నట్లు వైద్యశాఖ గుర్తించింది. క్లినిక్ నిర్వాహకులు నకిలీ జనరల్ ఫిజీషియన్‌గా శక్తివంతమైన యాంటీబయోటిక్స్ రాయడం, ఐవీ ఇన్ఫ్యూషన్లు ఇవ్వడం వంటి వైద్యసేవలను అందిస్తున్నట్లు పేర్కొంది.

☛ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 38 క్లినిక్‌లను సీజ్ చేయడంతో పాటు 10 డయాగ్నస్టిక్, స్కానింగ్, అల్ట్రా సెంటర్లను మూసివేసింది. ప్రభుత్వ నిబంధనలను పాటించని పలు ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులను కూడా వైద్యారోగ్యశాఖ జారీ చేసింది. ఇదిలా ఉండగా, వైద్యశాఖలో కొందరికి మామూళ్లు అప్పచెబుతున్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యం యధావిధిగా నకిలీ వైద్యులతో వైద్య సేవలు సహా చికిత్సలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

విద్యార్హతలు లేకుండా కొందరు వైద్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలు ఆసుపత్రులపై నిఘా పెంచాం. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. నకిలీ వైద్యులపై స్థానికులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సి.ఉమాగౌరీ, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్ జిల్లా

1200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం

మేడ్చల్: మండలంలో 1200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మేడ్చల్ మండల తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం డబిల్‌పూర్, పూడూరు, మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. టార్పాలిన్‌లు, తూకం యంత్రాలు, తేమ మీటర్ల అవసరానికి మేరా కొనుగోలు కేంద్రాల్లో ఉంచాలని సెంటర్ ఇన్‌చార్జ్‌లకు వివరించారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, రైతుల సౌకర్యార్థం తాగునీరు, కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు.

నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. శనివారం అలియబాద్‌లోని జనార్ధన్‌నగర్ చేనేత కాలనీలోని నాగదేవత ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి గ్రామస్తులు, గ్రామపెద్దలు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



పంట నేలపాలైతే రైతుల గోస వర్ణనాతీతం !

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే నీటిపాలు, నేల పాలైనప్పుడు రైతుల గోస, కన్నీళ్లు వర్ణనాతీతమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏదులాబాద్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఎంపీ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 20 రోజులైన కొనుగోలు చేయడం లేదని, ఇప్పటికి మూడుసార్లు వర్షం వచ్చి మొలకలు వచ్చాయన్నారు. బస్తాకు 3–4 కిలోల తరుగు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగ్స్, తాలు, హమాలీలు, రవాణా కష్టాలు రైతులను వెంటాడుతున్నాయని తెలిపారు. రోజుల తరబడి అన్నదాతలు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ఉంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.



ఏదులాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్

మేడ్చల్: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీ.జి.సాయిలుగౌడ్ అన్నారు. మేడ్చల్, వినాయక్‌నగర్ కాలనీలో మండల 4వ మహాసభను శీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసుకుంటూ.. సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలన్నారు. ఈనెల 25న ఉప్పల్ మండలంలోని ఈసీఐఎల్ పార్టీ కార్యాలయం వద్ద బంజారా ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, 400 మంది ప్రతినిధులు హాజరయ్యే సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్.బోస్ హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర మహాసభలు ఆగస్టులో 19 నుంచి 22 వరకు 4 రోజుల పాటు కుత్బుల్లాపూర్‌లో జరగనున్నాయని తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య, నాయకులు సోగడ రమేష్, వెంకటాచారి, ఎర్రోళ్ల అశోక్, రాజయ్య, ఆంజనేయులు, పూర్ణచంద్ర, మహమ్మద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

కీసర: కీసరలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జ్ అదనపు జిల్లా కలెక్టర్ హరిప్రియ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, డీఎస్‌సీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీవో వెంకట్‌రెడ్డిలతో కలిసి శనివారం తనిఖీలు చేశారు. వరిధాన్యం కొనుగోలు సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ధాన్యం కొనుగోలు సిబ్బందికి సూచించారు. రైతులకు వరి ధాన్యం సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని వరిధాన్యం కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, వ్యవసాయ అధికారి మాధవిలత, కీసర రైతు సహకార సొసైటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సీఈవో కృష్ణారెడ్డి, సిబ్బంది నరహరి తదితరులు పాల్గొన్నారు.



కీసరలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ హరిప్రియ

పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసిన కేసులో..

మాజీ బిల్ కలెక్టర్ రిమాండ్



ఘట్‌కేసర్: ఏదులాబాద్ పంచాయతీ నిధుల అవకతవకలకు పాల్పడిన మాజీ బిల్ కలెక్టర్‌ను ఘట్‌కేసర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఏదులాబాద్ పంచాయతీలో 2021–2022 ఆర్థిక సంవత్సరంలో అప్పటి సర్పంచ్ కాలేరు సురేష్, కార్యదర్శి ఉష, బిల్ కలెక్టర్ గాలిపల్లి రజనీకర్‌రెడ్డి గృహనిర్మాణపనులు, పన్నుల డబ్బులు రూ.17.25 లక్షలను ప్రజల నుంచి వసూలు చేసి నకిలీ అనుమతిపత్రాలు జారీ చేశారు. ఇట్టి నిధులు పంచాయతీ అకౌంట్‌లో జమచేయకుండా ముగ్గురు కలిసి వాడుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేయగా.. నిజమని తేలడంతో అప్పటి పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మహిళ అదృశ్యం



రజిత

జవహర్‌నగర్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్ ఎంప్లాయిస్ కాలనీలో నివసించే ముత్యాల నరేష్, భార్య రజిత (22)తో కలిసి ఉంటున్నారు. భార్యభర్తల మధ్య ఇటీవల తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో 16న రజిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



యంత్ర ప్రతిష్ఠాపనలో ఎంపీ ఈటల, తదితరులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మంటపారాధన, మూల విగ్రహ పంచామృత అభిషేకం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, ఆర్యవైశ్య సంఘంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంజీవరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచులు యాదగిరియాదవ్, వెంకటేష్‌గౌడ్, నిర్వాహకులు యాదగిరియాదవ్, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు 5,056 మెట్రిక్ టన్నులే !

- రూ.4.54 కోట్లకు రైతులకు చెల్లించిన ధాన్యం సొమ్ము రూ.4.27 కోట్లు
- మేడ్చల్‌లో లక్ష్యం 25 వేల మెట్రిక్ టన్నులు
- 13 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, పెరిగిన వరిసాగు
- యాసంగీలో దిగుబడి అంచనా 40 వేల మెట్రిక్ టన్నులు

సాక్షి,సిటీబ్యూరో: యాసంగిలో రైతు పండించిన వరి పంట ఉత్పత్తులకు సంబంధించి ఇప్పటి వరకు ధాన్యం 5,056.560 మెట్రిక్ టన్నులు జిల్లా పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేసింది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో పెరిగిన వరిపంట సాగుకు తగినట్లుగా ఉత్పత్తులు పెరగడంతో ఈ సీజన్‌లో రైతుల నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 13 కేంద్రాలను ప్రారంభించింది. జిల్లాలో నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలైన ప్రతాప్‌సింగారం, ఏదులాబాద్, మాదారం, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, కీసర, శామీర్‌పేట్, మేడ్చల్, డబీల్‌పురా, పూడూరు, అలియాబాద్, జగన్‌గూడలలో 951 మంది రైతుల వద్ద నుంచి ఇప్పటి వరకు 5,056.560 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లా పౌర సరఫరాల సంస్థ ఖరీదు చేసింది.

కేంద్రం మద్దతు ధరతో..

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో 13 కేంద్రాల ద్వారా గ్రేడ్‌– ఏ, కామన్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలో 951 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించి చెల్లించాల్సిన సోమ్ము రూ. 4.54 కోట్లు కాగా.. ఇప్పటి వరకు 335 మంది రైతులకు రూ. 4.27 కోట్లు అందజేశారు. మిగతా 25 మంది రైతులకు రూ. 27 లక్షలు చెల్లించాల్సి ఉందని, రెండ్రోజుల్లో సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమకాగలదని జిల్లా పౌరసరఫరాల సంస్థ జీఎం సుగుణబాయి వివరించారు.

రైస్ మిల్లులకు ధాన్యం తరలించడంలోనూ...

కొనుగోలు కేంద్రాల నుంచి ఖరీదు చేసిన వరిధాన్యాన్ని తరలించడంలోనూ తీవ్ర జాప్యం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైస్ మిల్లులకు మాత్రం 4,260.760 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తరలించారు. మిగిలిన 795.800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కేంద్రాల్లో రైతుల పడిగాపులు

రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చినప్పటికీ, ఇక్కడ మాత్రం విరుద్ధమైన పరిస్థితి నెలకొందని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తరలిస్తున్నారన్న నేపంతో సకాలంలో ధర నిర్ణయించి ఖరీదు చేయడం లేదు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో రెండు, మూడు రోజులు పడిగాపులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనేందుకు కొర్రీలు..

జిల్లాలోని పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వరంగ సంస్థలు కొర్రీలు పెడుతున్నారని రైతు సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు.

పెరిగిన వరి పంటసాగు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఈసారి యాసంగి సీజన్‌లో 13,454 ఎకరాల్లో వరిపంటను రైతులు సాగు చేయగా.. 40 వేల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు (ధాన్యం) రాగలవని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 13 కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

గతేడాది 13,520 మెట్రిక్ టన్నులు మాత్రమే..

గతేడాది యాసంగిలో మేడ్చల్ జిల్లాలో 13,342 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేయగా.. 38 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగలదని వ్యవసాయశాఖ అంచనా వేసింది. జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన సివిల్ సప్లై సంస్థ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో 2,377 మంది రైతుల నుంచి 13,520.320 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. సదరు రైతులకు ధాన్యానికి సంబంధించిన మొత్తం సొమ్ము రూ.29.78 కోట్లు చెల్లించారు.

